వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



శుక్రవారం 21 జూన్ 2024


## సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులు పూర్తి చేయండి



మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :
పట్టణంలో శాశ్విత నీటి ఎద్దడి నివారణకు నిర్మించిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు బిజెపి నాయకులు గుత్తా హరి క్రిష్ణ విన్నవించారు. గురువారం ఆయన అమరావతిలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ చిప్పిలి, గుంటివారిపల్లె సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులు పూర్తి చేసి పట్టణానికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. హిందువుల శ్మశాన వాటిక కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించాలని విన్నవించామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. కడప-బెంగుళూరు హైవే రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. రూరల్ ప్రాంతాల్లో కూడా డబుల్‌రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని కోరామన్నారు.



## సాయం సంధ్యవేళ ఇంద్రధనస్సు కనువిందు

రామసముద్రం, జూన్ 20 ప్రభాతవార్త :
సాయం సంధ్యవేళ ఇంద్రధనస్సు దర్శనమిచ్చి రామసముద్రం పట్టణ ప్రజలను కనువిందు చేసింది. గురువారం సాయంత్రం సమయంలో అరగంటపాటు ఇంద్రధనస్సు రామసముద్రం పట్టణంపైనే ఏర్పడింది. పట్టణ ప్రజలు, యువకులు, మహిళలు ఈ ఇంద్రధనస్సును సెల్ ఫోన్‌లో బందించారు.

# ఓ..మేఘమా...కరుణించవా...

- వర్షం కోసం రైతులు ఎదురుచూపులు
- ఖరీఫ్‌పై ఆశలు పెట్టుకొన్న రైతులు
- వారం రోజులుగా మేఘాలున్న ఫలితం శూన్యం



మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :
ఓ మేఘమా కరుణించవా అంటూ ఖరీఫ్ రైతన్నలు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వేరుశెనగ విత్తేందుకు వర్షం లేక రైతులు గత కొన్నాళ్లుగా రోజూ రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ముఖ్య కార్తెల్లో విత్తనం వేసుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అయితే గత పది రోజులుగా దట్టమైన మేఘాలు ఉన్నా చినుకు పడకుండానే కనుమరుగు అవుతున్నాయి. రుతుపవనాలు జిల్లాను తాకి వారం అవుతున్నా వర్షాలు మాత్రం తేలికపాటిగానే కురుస్తున్నాయి. ఈ వర్షం వల్ల రైతులకు ఉపయోగం లేకుండా పోతోంది. పెద్ద వర్షం పడకపోవడంతో వేరుశెనగ రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సబ్సిడీ వేరుశెనగను రైతులు తెచ్చుకొని ఒబ్బిడి చేసి విత్తనాలను సిద్దంగా ఉంచుకొన్నారు. అప్పులు చేసి దిక్కులు దున్నిన రైతన్నకు వర్షం అదునుకు పడితే ఖరీఫ్‌లో ఆశించిన మేరకు పంట దిగుబడి వస్తుందని కరువురైతులు ఆశల పల్లకిలో ఉంటున్నారు. పశ్చిమ మండలాల్లోని పిటిఎం, బి.కొత్తకోట, తంబళ్ళపల్లె, పెద్దమండ్యం తదితర గ్రామాల్లో వేరుశెనగ పంటను జీవనాధార పంటగా సాగు చేస్తారు. వర్షాధారమీద ఆధారపడే వేరుశెనగకు వర్షాలు సకాలంలో పడితే పంటలు ఆశించిన మేరకు వస్తాయని వ్యవసాయ అధికారులు, రైతులు చెబుతున్నారు. భూమి దుక్కుకు ఇటీవల సకాలంలో వర్షాలు పడడంతో సగంమంది రైతులు వారి భూములను దుక్కులు చేసి వేరుశెనగ విత్తేందుకు సిద్దంగా ఉన్నార. అన్నమయ్యజిల్లా పశ్చిమ మండలాల్లో వేరుశెనగ, టమోటాలు రైతులు విస్తారంగా సాగు చేస్తారు. వర్షాలు సకాలం లో పడితే వేరుశెనగతో పాటు అంతర్‌పంటలు అధిక దిగుబడులు వస్తాయని రైతులు ఆశగా ఉంటున్నారు. ఏది ఏమైనా అప్పులు చేసి వేరుశెనగ సాగు చేసేందుకు సన్నద్ధమైన రైతాంగానికి మేఘాలు కరుణించి వర్షాలు పడాలని గ్రామాల్లో రైతులు పూజలు చేస్తున్నారు. రోజూ ఆకాశం కారుమబ్బులతో కూడిన మెఘాలతో ఉంటుందే తప్పా వర్షం మాత్రం పడకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. రైతులు వర్షాలమీద ఆధారపడి ఈ ఖరీఫ్‌సీజల్‌లో ఆశలు పెంచుకొని వరుణదేవుడా కరుణించవా అంటూ పలవురు వేడుకోవడం జరుగుతోంది.

## వైఎస్ఆర్ కడప జిల్లాగా నామకరణం చేయాలి

కడప వైద్యవిభాగం, జూన్ 20, ప్రభాతవార్త:




కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి తొలి గడప అయిన కడప పేరును జిల్లాకు తిరిగి పెట్టాల్సింగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వైఎస్ఆర్ కడప జిల్లాగా నామకరణం చేయాలని సూచించారు. గురువారం కడప బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు వంగల శశిభూషణ్‌రెడ్డి, బాలకృష్ణ యాదవ్‌లు మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం పాటుపడతామని తెలిపారు. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రాణాయామం, యోగాసనాలు చేయాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 23న శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదానం దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. భరతమాత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 23 నుంచి జులై 6 వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న రీతిలో ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతన్నలను ఆదుకోవాలని కోరారు. రైతుల ఖాతాల్లో రూ.20వేలు కేంద్ర ప్రభుత్వం వేస్తుందని వెల్లడించారు. 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. క్వింటాళు వరి ధాన్యానికి రూ.2300 పెరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చలపతి ఇతర నాయకులు పాల్గొన్నారు.

## హరిత హోటల్‌లో ఏసీలు, గ్రీజర్‌లు చోరీ

కడప క్రైం, జూన్ 20, ప్రభాతవార్త:
కడప నగరంలోని వన్‌టౌన్ పీఎస్ పరిధిలోని హరిత టూరిజం హోటల్‌లో మరమ్మతులు, ముందు భాగాన రోడ్డు, కాలువ నిర్మాణం పనుల వలన ఏసీ, ఇన్‌డోర్లు, ఔట్‌డోర్లు, గ్రీజర్లను పక్కకు తీసి ఉంచారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు రూ.50వేలు విలువ చేసే వాటిని అపహరిం చుకొని వెళ్లారు. ఈ సంఘటనపై హరిత హోటల్ మేనేజర్ మల్లికార్జున పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ సంఘటనపై సాంకేతిక పరంగా సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం ఎల్లప్పుడు ముందుండాలి

రాయచోటి, జూన్ 20, ప్రభాతవార్త:
ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం ఎల్లప్పుడు ముందుంబాలని డీఆర్వో సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం ఎల్లప్పుడు ముందుండి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే అర్జీలపై రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డిటీ నరసింహకుమార్ మాట్లాడుతూ జీవో నంబరు 81ని తీసుకువచ్చి జూన్ 20న రెవెన్యూ డేగా జరుపుకోవడానికి కృషి చేసిన బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రెసిడెంట్ ఏపీఆర్ఎస్ఏ జనరల్ సెక్రటరీ రమేష్‌లకు జిల్లా రెవెన్యూ సిబ్బంది తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలపై రెవెన్యూ మరింత మెరుగ్గా పని చేసి వచ్చే రెవెన్యూ డేలోగా ప్రజా సమస్యల శాతాన్ని పూర్తిగా తగ్గే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలు అందించిన పలువురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో గోవిందు, గ్రామ, మండల, జిల్లా రెవెన్యూ అధికారులు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## గ్రామ సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేక గ్రామ సభ్యులు





లక్కిరెడ్డిపల్లె, జూన్ 20, ప్రభాతవార్త:
గ్రామంలోని సమస్యలు పరిష్కారం కోసమే ప్రత్యేక గ్రామ ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓపిఆర్డి పట్నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రెడ్డి వారిపల్లె గ్రామంలో ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా గ్రామంలోని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకరావాలని ప్రజలను అడడగా గ్రామస్తులు జోక్యం చేసుకొని గ్రామంలో ముఖ్యంగా త్రాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, ఉపాధి పన్నులు, ఏర్పాటు చెయాలని గ్రామస్తులు రోరారు. అలాగే దండేవాండ్లపల్లెకు రోడ్డు ఏర్పాటు చేయాలని దండేవాండ్లపల్లె గ్రామస్తులు అధికారులను కోరారు. హరిజనవాడలో సిసిరోడ్లు ఏర్పాటు చేయాలని, మైయిన్ రోడ్డు నుంచి హరిజనవవాడలోకి రోడ్డు ఏర్పాటు చేయాలని వారు కోరారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని రాత్రివేలల్లో దార్లల్లో విషపురుగులు తిరుగుతుంటాయని తొందరగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంక్ ద్వారా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి కొత్తరుణాలు తీసుకోవాలని ఏపిఎం నిరంజన్ తెలిపారు. అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని సర్పంచు భూదేవమ్మ ఉపాధి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రేటరీ సుదర్శన్ రెడ్డి, ఏపిఒ పెంచలయ్య, మాజి జడ్పిటిసి మోహన్రెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి

### సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమం



రాయచోటి, జూన్ 20, ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థినీ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ 2వ కోర్టు మెజిస్ట్రేట్ పి.శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ అంకిత భావంతో తరగతి గదిలోని పాఠాలను ప్రయోగశాలలలో నిర్ధారించుకొని తరగతి పాఠ్యాంశాలపై పూర్తి అవగాహనతో అభ్యసించాలని, కమ్యూనికేషన్ స్మార్ట్ స్కిల్స్‌పై పట్టు సాధించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డా.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి తరువాత విద్యార్థి వేసే ప్రతి అడుగు ఎంతో కీలకమైందని భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తుందని అభిప్రాయపడ్డారు. 10 తరువాత పాలిటెక్నిక్ కోర్సులో చేరి పూర్తి చేసుకుంటే చిన్న వయసులోనే ఉద్యోగం, ఉన్నత విద్య అవకాశాలు సొంతం చేసుకునే వీలుందని వీటిని పూర్తి చేసిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలకు పోటీ పడవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డా.ఆంజనేయులు మాట్లాడుతూ గత 23 సంవత్సరాల నుంచి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఎంతో మంది రూరల్ ఏరియా విద్యార్థినీ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించి ఉజ్వల భవిష్యత్తును కల్పించిందని అభిప్రాయపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రతాపరావు మాట్లాడుతూ రాయచోటి పరిసర మండల కేంద్రాల పరిధి నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తున్నదని వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన అర్థమెటిక్ రీజనింగ్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ కలల్పిస్తున్నాయని, ఆధునిక డిజిటల్ లైబ్రరీ సౌకర్యం, బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి సౌకర్యం అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

### టౌన్ ప్లానఇంగ్ అధికారి మునిరత్నం అవినీతిపై వరద ఆగ్రహం

### మున్సిపల్ అధికారుల సమీక్షా సమవేశంలో హెచ్చరించిన వరద

ప్రొద్దుటూరు, జూన్ 20, ప్రభాతవార్త:
ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న అధికారులు ప్రజాసేవలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ ఛాంబర్‌లో అన్ని విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారి మునిరత్నం అవినీతిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని రక్షించే దిశగా కాపలా కాస్తున్న సైనికులను చూసి నేర్చుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు అవకాశం కల్పిస్తే అవినీతికి పాల్పడటం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇప్పటి నుండి అయిన అధికారులు ఎలాంటి అవినీతికి పాల్పడకుండ ప్రజలకు మౌళిక వసతులు కల్పించడంలో అలసత్వం వహించకూడదని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ ఆస్థులను, స్థలాను గుర్తించి ఒక నివేదిక ఇవ్వాలని కమీషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వాన పరిస్థితుల్లో ఉందని తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మురుగునీటి కాలువలలో పూడిక తీతవేత దోమలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో త్రాగునీటి సమస్యను అధిగమించే క్రమంలో పూర్తిచేసిన అమృత్ పథకంను సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు త్రాగునీరు అందించడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించుకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే కాంట్రాక్టర్‌లకు నోటీసులు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలోని ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన 18వేల జగనన్న ఇళ్ల నిర్మాణంపై ఆరా తీశారు. సుమారు 17వేళ ఇళ్లకు ప్రభుత్వం ఇచ్చే 1,80,000 కాకుండా అదనంగా 70వేలు మరియు 35వేలు రూపాయలు వసూళ్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలపై ఇష్టారాజ్యంగా చేసి ప్రజలను మోసం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ నిధులను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన కాలువలపై అక్రమాలను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ రఘునాధరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష, డీఈ దస్తగిరి, ప్రభాకర్, రమణ, ఏఈలు దస్తగిరి రెడ్డి, ఉమామహేశ్వరి, బ్యూలా, పట్టణ ప్రణాళిక అధికారి మునిరత్నం, పారిశుద్ధ్యం అధికారులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ జబీవుల్లా, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గంగమ్మ జాతరలు

చిట్వేలి, జూన్ 20, ప్రభాతవార్త:
మండల పరిధిలోని తిమ్మాయపాలెంలో గురువారం గ్రామ పెద్దలు గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మిరుమిట్లు గొలిపే విద్యుత్తు కాంతులతో బంధువర్గంలో జాతర సందడి నెలకొంది. పోతులరాజు ఊరేగింపు కనువిందు చేసింది. గురువారం వేకువ జామున మంగళ వాయిద్యాలతో అమ్మవారి గుడిలో కొలువు దీరారు. వేలాది మంది భక్తులు కాయా కర్పూరం బలిదానాలతో తమ మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణలతో పందారపు బండ్లు మరింత ఆకర్శణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మరియు స్తానిక నాయకులు, గ్రామస్థులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## క్షయ వ్యాధి లేని సమాజం తయారు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

కలికిరి, జూన్ 20, ప్రభాతవార్త:
క్షయ వ్యాధి లేని సమాజం తయారు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని టీబీ పర్యవేక్షణాధికారి నాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కలికిరి మండలంలోని ఇందిరమ్మ కాలనీ, మజ్జిగవాండ్లపల్లె, గడి, పల్లవోలు గ్రామాల్లో జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించి అనంతరం గ్రామస్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి సోకకుండా ప్రజలను కాపాడేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం టీకాలు వేస్తున్నట్లు హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ పేర్కొన్నారు. బీసీజీ టీకాలపై అదే విధంగా క్షయ వ్యాధిపై హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ గ్రామస్థులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేడికుర్తి ఏఎన్ఎం సరిత, ఎంఎల్‌హెచ్‌పీ భానుప్రియ, ఆశా కార్యకర్త అనుసూయలు పాల్గొన్నారు.

## బొడితిప్పనపాడు జెండా పండగకు హాజరైన నారాయణరెడ్డి

జమ్మలమడుగు, జూన్ 20, ప్రభాతవార్త:
పెద్దముడియం మండలం బోడి తిప్పనపాడు గ్రామంలో గురువారం జెండా పండగ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసినట్లు ఎమ్మెలల్సీ దేవగుడి నారాయణరెడ్డి తెలిపారు. జెండా పండగను అన్ని కులాల వారు బేధాభిప్రాయాలు లేకుండా ముస్లింల ఒధం పండగను ఘనంగా నిర్వహించారు. దేవగుడి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భోజనాలు ఏర్పాటు చేశారు. మండల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

## 98 కేసులు అక్రమ మద్యం ధ్వంసం

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 20, ప్రభాతవార్త:
రాజుపాలెం పీఎస్ నందు సీజ్ చేసిన 98 కేసులు అక్రమ మద్యాన్ని ధ్వంసం చేసినట్లు ఏఎస్పీ వెంకట రాముడు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్ఈబీ శ్రీనివాసులు నాయుడు సమక్షంలో ప్రొద్దుటూరు రూరల్ పీఎస్, 2, 1వ పట్టణ పీఎస్, రాజుపాలెం పీఎస్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 2893 సీసాలను గురువారం ధ్వంసం చేశారు.
ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రొద్దులూరు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



# వేగవంతంగా వినాయకుని గుడి నిర్మాణ పనులు

**బద్వేలు అర్బన్, జూన్ 20 (ప్రభాతవార్త) :**
బద్వేలు పట్టణంలోని మైదుకూరు రోడ్డు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి షాపింగ్ కాంప్లెక్స్ పక్కన ఆర్యవైశ్యవర్తక సంఘం కమిటి సభ్యుల సహకారంతో సుమారు రూ.30లక్షల వ్యయంతో శ్రీ వినాయక స్వామి నూతన ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీ కొలిశెట్టి నాగరాజ, ట్రెజరర్ ఇమ్మడి శెట్టి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలు సగళా సురేష్‌బాబు, వైభవ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌లు దర్శి వెంకటేశ్వర్లు మునగా చలమయ్య , గౌరవాధ్యక్షులు పీవిఎన్. ప్రసాద్, రాచపూడి సాయిక్రిష్ణలు తెలిపారు. ఈ సందర్బంగా ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విదంగా ఆర్యవైశ్య నిరుపేదలు వ్యాపారాలు చేసుకునేందుకు దాతల సహకారంతో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, గతంలో ఆర్యవైశ్యులు మరణించినపుడు అంత్యక్రియలు చేసుకునేందుకు వసతులు లేకపోవడంతో అక్కడ అంత్యక్రియలకు అవసరమైన వసతులను పలువురు దాతల సహకారంతో సుమారు రూ.60లక్షల వ్యయంతో వైకుంఠ రథంతో పాటు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వినాయకుడి దేవాలయం నిర్మాణం కొరకు ఆర్యవైశ్య వర్తక సంఘం సభ్యులు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సహకారం అందించాలని దేవాలయ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని, రాబోయే కార్తీకమాసం కల్లా విగ్రహా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తాము చేస్తున్న ప్రతి కార్యక్రమానికి ముందుకు వస్తున్న ప్రతి ఆర్యవైశ్య కుటుంబ సభ్యునికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## క్షయవ్యాధి పట్ల జాగ్రత్త వహించాలి



**బద్వేలు అర్బన్, జూన్ 20, ప్రభాతవార్త :**
ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతిరోజూ వార్డులో ప్రజలకు అవసరమైన మెరుగైన వైద్యసేవలందిస్తున్నామని 9వ వార్డు ఆంజనేయనగర్ సచివాలయం ఏఎన్ఎం సత్యనారాయణమ్మ, ఆశ కార్యకర్తలు వెంకటలక్షుమ్మ, ఆదిలక్షుమ్మ అన్నారు. గురువారం ఆంజనేయనగర్ పరిధిలోని పలువురు ప్రజలకు క్షయ వ్యాధి నివారణ లో భాగంగా బీసీజీ వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు.ఈ సందర్బంగా ఏఎస్ఎం సత్యనారాయణమ్మ మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో ఆంజనేయనగర్‌లో గత 6వారాలలో బీసీజీ వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. క్షయవ్యాధి రహిత సమాజానికి కృషిచేస్తామన్నారు. ప్రజలు ముందస్తుగా ఈ టీకాను వేసుకోవడం వలన భవిష్యత్తులో క్షయవ్యాధి రాకుండా ఉండవచ్చన్నారు. జిల్లా వైద్య శాకాధికారుల ఆదేశాల మేరకు ప్రతిరోజూ వార్డులో ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య సేవలందించడం జరుగుందన్నారు. ప్రజలు కూడా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని అపుడే వ్యాధులు దరి చేరకుండా ఉంటాయన్నారు.ఈ టీకాలను 60 సంవత్సరాలు పైబడిన వారికి , షుగర్ వ్యాధి గ్రస్తులకు, 5 సంవత్సరాల క్రితం క్షయవ్యాధి వచ్చిన వారికి మరియు బరువు 18 కేజీల కంటే తక్కువ ఉన్నవారికి ఈ బీసీజీ టీకాలు వేయడం జరిగిందన్నారు. క్షయ రహిత భారతదేశమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన రాజశేఖర్

**బద్వేలు అర్బన్, జూన్ 20, ప్రభాతవార్త :**
2024సార్వత్రిక ఎన్నికలలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గురువారం బద్వేలు టీడీపీ నాయకులు డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్ ముఖ్యమంత్రి చాంబర్‌లో పూలబొకేను అందించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా రాజశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన రోజే ఐదు హామీలపై తొలి సంతకం పెట్టారని జగన్ అరాచక పాలనకు తెరపడిందని, ఇక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చంద్రబాబుహయాంలో అత్యంత అంకిత భావంతో జరుగుతాయన్నారు. గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న టీడీపీ శ్రేణులకు మంచి రోజులు వచ్చాయని, టీడీపీ పాలనపై ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారన్నారు.



## బిజెపి నేత కొవ్వూరు బాలచంద్రా రెడ్డి మృతి

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 20, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు బిజెపి సీనియర నేత కొవ్వూరు బాలచంద్రారెడ్డి అనారోగ్య కారణాల వల్ల గురువారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుప్రతి నందు మృతి చెందారు. ప్రొద్దుటూరు అబివృద్ధికై తనవంతు సహాయ సహకారాలు, పోరాటాలు, దీక్షలు, ధర్నాలు చేసిన బాలచంద్రారెడ్డి ఒక్క ప్రక్కబిజెపి పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ మరోప్రక్క క్లాస్ వన్ కాంట్రాక్టర్‌గా తన వృత్తిని నిర్వహిస్తూ ఇక్కడి ప్రజలకు కావలసిన మౌళిక వసతులైన రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, ప్రత్యేకించి త్రాగునీటికై ఆయన చేసిన ఉద్యమాలు నిరాహార దీక్షలు ఇక్కడి ప్రజలకు గుర్తుండే ఉంటాయి. కొవ్వూరు రామసుబ్బారెడ్డి రెండవ సంతానమైన కొవ్వూరు బాలచంద్రారెడ్డి ప్రొద్దుటూరులోని ఎస్వీ ఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోఅలాగే ఎస్వీ విశ్వవిద్యాలయం నందు 1984లో గ్రాడ్యుయేట్ డిగ్రీ చేశారు. అనంతరం ఒక ప్రక్క వ్యవసాయం, మరోపక్క రాజకీయాలలో తన ఉనికిని చాటుకుంటూ, కాంట్రాక్టర్‌గా మంచి గుర్తింపు, గౌరవం పొందారు. రాజకీయ పరంగా 2004వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి 22,118 ఓట్లు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. 2014లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి 2210 ఓట్లతో ఐదవ స్థానంలో నిలిచారు. అటు బిజెపి అధిష్టానంతోనూ ఇటు ప్రొద్దుటూరు నియోజకవర్గ నాయకులతో సత్సంబంధాలు కలిగిన బాలచంద్రారెడినడ పలు సేవా కారనయక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. ప్రొద్దుటూరు మున్సిపల్ అనిబిసెంట్ మైధానం అభివృద్ధిలో బాలచంద్రారెడ్డి పాత్ర కొనియాడదగినది. ఇలా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా తత్పరుడిగా పేరు పొందారు. బాలచంద్రారెడ్డి మరణ వార్త విన్న ఆయన అభిమానులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రజలు, అభిమానులు, నాయకులు, కార్యకర్తల కొరకు ఆయన భౌతికకాయాన్ని సంధర్శనార్థం కొవ్వూరు గ్యారేజ్ నందు ఉంచుతున్నట్లు, శుక్రవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరుపబడునని ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.



## ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు

**దువ్వూరు, జూన్ 20, ప్రభాతవార్త:**
మండలంలో రైతులకు, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందచేస్తున్నామని మండల తహసీల్దార్ ఉమారాణి అన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవం సంధర్బంగా పదవి విరమణ చేసిన గ్రామ రెవెన్యూ అధికారి బయపురెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సంధర్బంగా తహసీల్దార్ ఉమారాణి మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు చారిత్రక ఘట్టం ఉందని, 16వ శతాబ్దంలో మొదటి సారి భూమి శిస్తు వసూలు చేసిందని అప్పటి నుండి రెవెన్యూ శాఖ భూమి రికార్డు తయారుచేయడం నిర్వహించడం జరుగుతుందన్నారు. 1972లో భూమి శిస్తు వసూలు చేసేందుకు జిల్లాకు ఒక కలెక్టర్‌ను నియమించారని అలాగే 1786లో రెవెన్యూ బోర్డును స్థాపించి బడిందన్నారు. అప్పటి నుండి రెవెన్యూ శాఖ వివిధ రూపాలు చెందుతూ కరణాలు, రెడ్ల వ్యవస్థ తరువాత ప్రస్తుతం గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సహాయకులు పాలనలో కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఘనమైన సేవలు అందియ్యడం వల్ల ప్రతి ఏడాది జూన్ 20వ తేదిన రెవెన్యూ శాఖ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జాన్సన్, వీఆర్ఓలు రమణారెడ్డి, రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి చేయూత

**సిద్ధవటం, జూన్ 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిద్ధవటం చెంచులక్ష్మి యానాది కాలనీ నందు నివాసం ఉన్న పాటూరి మునయ్య(65) అనారోగ్యం కారణాల వల్ల మృతి చెందిన విశయం రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో 10వేల రూపాయలు మృతి చెందిన కుటుంబసభ్యులకు గురువారం అందించారు. ఈ సంధర్బంగా చెంచులక్ష్మి కాలనీవాసులు మాట్లాడుతూ మాకు ఏ సమస్య వచ్చినా కూడ అన్ని విధాల ఆదుకుంటున్న జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. మృతి చెందిన కుటుంబానికి ఆదుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేత షేక్ మహబూబ్ బాష(బాబి) విజయ్ పాల్గొన్నారు.



## అన్యాయం జరిగింది
## రెవెన్యూ అధికారులు న్యాయం చేయండి

**ఖాజీపేట, జూన్ 20, ప్రభాతవార్త:**
ఖాజీపేట రెవెన్యూ అధికారులు తమ కుమార్తె పేరిట ఉన్న రెండు ఎకరాల స్థలాన్ని వేరే వారి పేరిట ఉన్న రెండు ఎకరాల స్థలాన్ని వేరే వారి పేరిట ఆన్‌లైన్ చేశారని ఖాజీపేటకు చెందిన గంగిరెడ్డి అంకిరెడ్డి ఆరోపించారు. బాధితుల కథనం మేరకు ఖాజీపేట మండలం కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఖాజీపేట మండలం తవ్వారి పల్లె గ్రామ సర్వే నెంబర్ 98లో రెండు ఎకరాల స్థలం తమ కుమార్తె వరలక్ష్మి పేరిట ఉందని తెలిపారు. ఖాజీపేట రెవెన్యూ అధికారులు తమ ప్రత్యర్థుల నుంచి డబ్బులు తీసుకొని తమ కుమార్తె పేరిట ఉన్న రెండు ఎకరాల స్థలాన్ని రావులపల్లె వైసీపీ సర్పంచ్ తమ పలుకుబడితో సర్పంచ్ సమీప బంధువుకు, సోదరుడికి ఆన్‌లైన్ చేపించారని వాపోయారు. చేసేదేమి లేక కోర్టును ఆశ్రయించానని చెప్పారు. వేరే వారి పేరిట ఆన్‌లైన్ చేయించిన పట్టాదారు పాసుపుస్తకం రద్దు చేసి అధికారులు తమ భూమిని తనకు ఇప్పించాలని కోరారు.



## యువత సమస్యలకు అవగాహన కల్పించడమే ఎస్ఐఓ లక్ష్యం

**ప్రొద్దుటూరు జూన్ 20, ప్రభాతవార్త:**
నేటి యువత లక్ష్యరహిత జీవితం, నైతిక పతనానికి లోనై యువతలో విచ్చలవిడిగా అశ్లీలం నగ్నత్వం మాదకద్రవ్యాల సేవనం జీవిత లక్ష్యాన్ని విస్మరిస్తున్న నేపథ్యంలో అలాంటి యువత సంస్కరణలో భాగంగా అవగాహన కల్పించడమే స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు రోషన్, జమీర్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఐఓ మోరల్ రీచింగ్ ట్రాన్స్ ఫార్మేషన్ సెల్ఫ్ అండ్ సొసైటీ జూన్ 20నుండి జూలై 10వ తేది వరకు స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన ఉద్యమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంధర్భంగా కార్యక్రమానిరి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఎస్ఐఓ గత 42 సంవత్సరాలుగా విధ్యార్థులు మరియు యువకుల సమస్యలను పరిష్కరిస్తూ అహర్నిశలు కృషి చేస్తూ ఉందని, దేశాభివృద్ధి మరియు ప్రగతిలో విధ్యార్థులు మరియు యువత కీలకపాత్ర పోషిస్తారని, కానీ నేటియువత లక్ష్య రహిత జీవితం, నైతిక పతనానికి లోనై ఉన్నారని అన్నారు. సమాజంలో పేరుకు పోయిన చెడులనునిర్మూలించి ఉత్తమ నైతిక సమాజాన్ని నిర్మించడం, ఈ ఉత్తమ నైతిక సమాజా నిర్మాణానిపై ప్రభుత్వ యంత్రాంగం, విద్యావంతులు, ధార్మికవేత్తలు, విధ్యార్థి సంఘాలు, మీడియా మరియు విచక్షణ కలిగిన పౌరులందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐవో పట్టణ అధ్యక్షుడు ఆదిల్ ఖాన్, సభ్యులు ఎజాజ్, అబ్దుల్ ముసావిర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటలో ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు




**రాజంపేట అర్బన్, జూన్ 20, ప్రభాతవార్త:**
రాజంపేట రెవెన్యూ డివిజనల్ ఆఫీసులో గురువారం "రెవెన్యూ దినోత్సవం" వేడుకలు ఘనంగా జరిగాయి. సమావేశం ఆర్‌డిఓ మోహణరావు అధ్యక్షతన జరిగింది. రెవెన్యూ వ్యవస్థ పూర్వం నుండి ప్రస్తుతం వరకు ఎలా ఏర్పడి, ప్రజలకు ఉపయోగము కలిగించుచున్నది అనే విశయాలను క్లుప్తంగా వివరించారు. రెవెన్యూ వ్యవస్థ ఏర్పడడానికి గల ఆవశ్యకతను తెలియజేశారు. రెవెన్యూ దినోత్సవం సమావేశమునకు గవర్నమెంట్ ప్లీడర్ గురు ప్రతాప్‌రెడ్డి, రాజంపేట తహసీల్దార్ ఇన్బనాధన్, జనసేన నాయకులు రామ శ్రీనివాస్ హాజరయ్యారు. దేశమునకు స్వాతంత్ర్యం రాక మునుపు బ్రిటిష్ ప్రభుత్వం నందు 20.06.1786 తేదిన రెవెన్యూ వ్యవస్థ మొదలు అయి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, గ్రామ స్థాయిలో పటేల్, పట్వారి వ్యవస్థ ఏర్పడి, తరువాత 1985లో రద్దు కాబడి, విలేజ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా, పంచాయతీ కార్యదర్శిగా, విలేజ్ రెవెన్యూ అధికారిగా పరిపక్వత చెంది, గ్రామస్థాయిలో ఏర్పడటం జరిగిందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ వ్యవస్థ ఉద్యోగులు తమ యొక్క విధులను సక్రమంగా నిర్వహించి రెవెన్యూ వ్యవస్థకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. ప్రభుత్వానికి వెన్నెముకలాగా వ్యవహరించాలని కోరారు. ఈ సంధర్బంగా ఆర్డీవో కేక్ కట్ చేశారు. రెవెన్యూ ఉద్యోగులు రెవెన్యూ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## సమాన పనికి సమాన వేతనం

**కడప వైద్యవిభాగం, జూన్ 20, ప్రభాతవార్త:**
సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో కాంట్రాక్టు పద్ధతిపై ఒకేషనల్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లుగా సేవలందిస్తున్న తమకు వేతనాలు ఇవ్వలేదని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రూ.14వేలు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

## అక్షర శిల్పి స్వర్గీయ రామోజీరావుకు శ్రద్ధాంజలి

**కడప వైద్యవిభాగం, జూన్ 20, ప్రభాతవార్త:**
ఈనాడు సంస్థల అధినేత స్వర్గీయ చెరుకూరి రామోజీరావుకు సప్తగిరి కల్యాణ మండపం యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రామోజీరావు చేసిన ప్రజాయిత కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ జర్నలిజానికి కొత్త ఒరవడి సృష్టించి రైతులకు అండగా మార్గదర్శిగా నిలిచిన మహానేతకు నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు.



## విదేశీ విద్యకు అంబేద్కర్ ఓవర్ సీస్ విద్యానిధిగా మార్చడం అభినందనీయం



**బద్వేలు అర్బన్, జూన్ 20 ప్రభాతవార్త :**
విదేశీ విద్య అంబేద్కర్ ఓవర్ సీస్ విద్యానిధిగా పేరు మార్చడం అభినందనీయమని టీడీపీ నాయకులు జి. మల్లయ్య, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి దానం అన్నారు గత ప్రభుత్వఈ విద్యకు జగన్ పేరును చేర్చడంతో పాటు వారినుంచి విద్యను దూరం చేసిందని వాపోయారు. ప్రస్తుత అలాగే ఎస్సీ సంక్షేమ పథకాలు, సబ్‌ప్లాన్ నిదులను దారి మళ్లించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు జి.రాయప్ప, భాస్కర్, చెన్నయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయం

**బద్వేలు అర్బన్, జూన్ 20 ప్రభాతవార్త :**
క్షయవ్యాధిని నిర్మూలించడంలో భాగంగా గురువారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పలువురికి టీకాలు వేయడం జరిగిందని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. ఈ టీకాలను 60 సంవత్సరాలు పైబడిన వారికి, షుగర్ వ్యాధి గ్రస్తులకు, 5 సంవత్సరాల క్రితం క్షయవ్యాధి వచ్చిన వారికి మరియు బరువు 18 కేజీల కంటే తక్కువ ఉన్నవారికి ఈ బీసీజీ టీకాలు వేయడం జరిగిందన్నారు. క్షయ రహిత భారతదేశమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ నరసింహ ప్రసాద్, ల్యాబ్ సూపర్‌వైజర్ బ్రహ్మారెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధనరావు, శ్రీరాములయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘర్షణలో ఇరువురికి తీవ్ర గాయాలు

**కడప క్రైం, జూన్ 20, ప్రభాతవార్త:**
కడప నగరంలోని వన్‌టౌన్ పీఎస్ పరిధిలో రాజీవ్ పార్కు సమీపంలో బుధవారం రాత్రి కర్రీస్ పాయింట్ సమీపంలో విష్ణువర్ధన్ అలియాస్ నాని, నరసింహాచారి అలియాస్ నరసింహాకు మరో వైపు గణేష్ అలియాస్ సంజు, ఓబులేసు అలియాస్ బబ్లూలపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఎర్రముక్కపల్లె నుంచి రైల్వే గేటు మార్గమధ్యలో షేక్‌మస్తాన్, గణేష్, ఓబులేసు అనే ముగ్గురు మద్యం సేవించారు. కర్రీస్ కోసం రాజీవ్ రాజీవ్ పార్కు వైపు మోటారు సైకిల్‌లో ముగ్గురు వచ్చారు. అక్కడ కనిపించిన వారిలో గతంలో మనస్పర్థల వలన విష్ణువర్ధన్, నాని నరసింహాచారిలు ఎదురు పడడంతో మొదట ఒకరినొకరు వాగ్వాదం చేసుకున్నారు. తరువాత గొడవ పడ్డారు. ఈ గొడవలో గణేష్‌కు వీపుపై గాయాలయ్యాయి. ఓబులేసుకు చేతికి, కుడివైపు చెవికి గాయాలయ్యాయి. ఈ సంఘటనలో షేక్ మస్తాన్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. నిందితులతో విష్ణువర్ధన్, నరసింహులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. నాని పరారీలో ఉన్నాడు. ఈ సంఘటనపై బాధితులలో ఒకరైన షేక్ మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## ఆసరా కోల్పోయిన అనాథ వృద్ధులను ఆదుకుంటాం



**బద్వేలు అర్బన్, జూన్ 20, ప్రభాతవార్త :**
అనేక కారణాలతో ఆసరా కోల్పోయి అశ్రమాన్ని ఆశ్రయించిన అనాద వృద్దులకు తనవంతు సహకారాలను అందిస్తానని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ పల్లె సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పల్లె సుబ్బారెడ్డి సతీమణి వెంకటసుబ్బమ్మల కుమార్తె సుస్మిత 19వ జన్మదినం సందర్భంగా అనాథ వృద్దులకు రుచికరమైన భోజనం, పండ్లు, తినుబండారాలను అందజేసి పలువురు వృద్దులను ప్రేమ, ఆప్యాయతగా పలకరిస్తూ వృద్ధుల మధ్య సుస్మిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పల్లె సుబ్బారెడ్డి మాట్లాడుతూ అనేక కారణాలతో ఆయా కుటుంబాలలో వివిధ రకాల సమస్యలతో ఆశ్రమాన్ని ఆశ్రయించిన అనాథవృద్ధులకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని తమ కుమార్తె జన్మదిన వేడుకలను వృద్ధుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ఆశ్రమానికి తనవంతు సహాయంగా రూ.5వేలు అందజేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన అనిల్‌కుమార్ రాజు, బాసికాల నారాయణ, శ్రీనివాసులు, పిన్నిబోయిన నరసింహ, జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పలువురు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పల్లె సుబ్బారెడ్డి కుటుంబ సభ్యుల పుట్టిన రోజు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందదాయమని సుస్మిత ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాల లని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పల్లె యల్లారెడ్డి, రామలక్షుమ్మ, పద్మావతి, ఓబులేసు, శివ, ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవికుమార్‌తో పాటు పాల్గొన్నారు.

## వైసీపీ కౌన్సిలర్లపై దాడి దురదృష్టకరం

**రాయచోటి, జూన్ 20, ప్రభాతవార్త:**
రాయచోటిలో వైసీపీ కౌన్సిలర్లపై దాడి చేయడం దురదృష్టకరమని వైసీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు ఇలాంటి ఘటనలు జరగనీయకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ కొలిమి హరూన్ బాషా ఇంటిపైకి వచ్చి దాడికి దిగి, భయభ్రాంతులకు గురిచేయడం వారి వాహనాన్ని ధ్వంసం చేయడం అరాచక చర్యగా అభివర్ణించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**దువ్వూరు, జూన్ 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు వాసవి క్లబ్ ప్రెసిడెంట్ దేవత ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసిన వారికి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని, ఈ కార్యక్రమంలో దాదాపు 20మందికి పైగా రక్తదానం చేశారని, రక్తదానం చేయడం వలన మనిషిలో ఆరోగ్య సమస్యలు అనేవి తగ్గుతాయని నమ్మకంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమానికి సురక్ష వాలంటరీ బ్లడ్ సెంటర్ ప్రొద్దుటూరు వారి ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈపూరి సత్యనారాయణ, బచ్చు సత్యనారాయణ, కందుకూరి మహేంద్రనాథ్, రాయవరం చంద్రశేఖర్, కిశోర్, పేర్ల శేశయ్య పాల్గొన్నారు.



### పేరు మార్పు

సి బాను భర్త షరీఫ్ అడ్రస్ 6-730 టెలిఫోన్ వీధి, కలికిరి విలేజ్, కలికిరి మం. అన్నమయ్య జిల్లా ఏపి. నా ఇన్సూరెన్సు బాండు నందు సి షకీలా ఉన్నది. బాండు నెం.02471688. నేటి నుండి సి బానుగా పిలువబడును. గమనించగలరు.

# రైతులకు ఆర్థికసాయం అందించాలి

వేంపల్లె, జూన్ 20, ప్రభాతవార్త ః



మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు ఆర్థిక సహాయం అందించాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్. తులసిరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, జూన్ 22న ఏరువాక పౌర్ణమి పండుగ ఉందన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తామని, టీడీపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని తులసిరెడ్డి గుర్తుచేశారు. ఇది సరైన సమయమని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే రైతులకు, కౌలు రైతులకు కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు ఆర్థికసాయం అందించాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. కడప జిల్లాలో ఉన్న యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంగణం నుండి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించవద్దని ఆయన తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడని, 16ఏళ్ల నుండి ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించబడి ఉందన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాల ద్వారా విద్యారంగానికి ఆయన చేసిన సేవలు అమోఘమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాలు పొందారన్నారు. అటువంటి విద్యాప్రదాత విగ్రహాన్ని తొలగించమనడం ఏమాత్రం సమంజసం కాదని తులసిరెడ్డి హితవు పలికారు. అంతేకాకుండా రాయలసీమ నుండి కార్యాలయాలు తరలించవద్దని, ఇది సరైన ఆలోచన కాదన్నారు.

# ఒకినోవా గుజురియో జనరల్ సెక్రటరీగా ఏఆర్.సురేష్

మదనపల్లెక్రైం, జూన్ 20 ప్రభాతవార్త :



ఒకినోవా గురురియో దూ ఫెడరేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీగా గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఏఆర్. సురేష్‌ను నియమించడం జరిగింది. ఈనెల 17న ఇంటర్‌నేషనల్ ఒకినావా గుజియియో దూ ఫెడరేషన్ సమావేశాల్లో యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అషోసియేషన్ అధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను పెడరేషన్ సెక్రటరీగా నియమించడం జరిగిందని గ్రాండ్ మాస్టర్ సోకెసార్ అనంతన్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏఆర్.సురేష్ మాట్లాడుతూ ఒకినోనవా గుజిరియో దూ పెడరేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీగా నియమించిన మహగురు సొకెసర్ కె.అనంతన్ మాస్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో 20సమస్యలు విన్నపం



మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం డివిజన్ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో 20సమస్యలు వినియోగదారులు విన్నవించినట్లు ఈఈ యుగందర్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఈ అదాలత్‌ను నిర్వహించారు. డివిజన్ పరిధిలోని బి.కొత్తకోట, పిటిఎం, మొలకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, నిమ్మనపల్లె, మదనపల్లె రూరల్, అర్బన్, రామసముద్రం మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సమస్యలను విన్నవించారు. వినియోగదారులు విన్నవించిన సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

# షాదీలు జరగని మహాల్

నిమ్మనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :



ముస్లింల కోసం నిర్మించిన షాదీమహాల్ నిరుపయోగంగా మారింది. చుట్టూ ముళ్ళపొదలు పెరిగాయి. రాత్రిపూట అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయిన స్థానికులు వాపోతున్నారు. షాదీమహాల్‌కు మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు అధికారులను కోరిన పట్టించుకోకపోవడంతో మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని తవళం రోడ్డులో ముస్లింలకు సౌకర్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో 2003లో షాదీమహాల్ నిర్మాణం చేపట్టారు. దాతలు షఫీవుల్లాఖాన్, జాఫర్‌అలీఖాన్, మహబూబ్‌బాషాఖాన్, అన్వర్‌ఖాన్ స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. సర్పంచ్ మల్లప్ప భవనాన్ని పూర్తి చేశారు. పూర్తి అయిన తరువాత మసీదుకమిటీకి అప్పగించారు. నీటి సౌకర్యం లేకపోవడంతో ముస్లిం వివాహలు జరిగేందుకు ముందుకు రాలేదు. తరువాత దీనిని పట్టించుకునేవారు లేరు. దీంతో అందులోని సామాగ్రి కూడా చోరీ గురయ్యాయి. ప్రస్తుతం భవనం చుట్టూ ముళ్ళపొదలు పెరిగాయి. ఈ షాదీమహాల్‌ను ఉపయోగంలోకి తెచ్చేందుకు అధికారులు, ముస్లిం పెద్దలు చొరవ చూపకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, అధికారులుకాని స్పందించి ఈ మహాల్‌ను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

# మద్దతు ధర పెంపు హర్షణీయం



వేంపల్లె, జూన్ 20, ప్రభాతవార్త ః

ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంపును కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సునీల్‌కుమార్ వెల్లడించారు. గురువారం వేంపల్లెలో బీజేపీ నేతలతో కలిసి ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్దతు ధర పెంచడంపై వరి ధాన్యం క్వింటా రూ.2300కు చేరుతుందన్నారు. దాదాపు 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర లభించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. వరితోపాటు ఆవాలు, కందులు, పత్తి, మొక్కజొన్న, రాగి, జొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటలకు మద్దతు ధర పెంపును కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కేంద్రంలో మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోడీ పీఎం కిసాన్ నిదులు విడుదల చేసి, రైతులకు శుభవార్త చెప్పిన విధంగా, ఆయా పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించడంపై రైతులకు ఊరట కలిగిస్తోందన్నారు. రైతుల పట్ల మోడీ ప్రభుత్వం ఎప్పుడూ ముందంజలో ఉంటుందని, మరోసారి నిరూపితమైందన్నారు. మద్దతు ధర పెంపు పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సి.సుష్మా, జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# దాడికేసులో ఇద్దరు అరెస్టు

పీలేరు, జూన్ 20 ప్రభాతవార్తః



పట్టణానికి చెందిన షేక్ షాకీర్, షేక్ షబ్బీర్‌లను గురువారం అరెస్టుచేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు గత కొద్దిరోజులుగా పీలేరు పట్టణానికి చెందిన ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లు ఎస్సై నరసింహుడు తెలిపారు.

# ఆత్మహత్యకు కారకులపై కేసు నమోదు చేయాలి



మదనపల్లెక్రైం, జూన్ 20 ప్రభాతవార్త :

కురబలకోట మండలం అంగళ్ళు మల్లయ్యకొండ సమీపంలో ఆత్మహత్య చేసుకొన్న రామిశెట్టి రమేష్ బాబు మృతికి అప్పులు కారణం కాదని, మదనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు ఇంటిస్థలం విషయంలో మోసం చేయడంతోనే జరిగిందని కుటుంబసభ్యులు వాపోయారు. మృతుడు సూసైడ్‌నోట్‌లో పేర్కొన్న విధంగా ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని జిల్లా ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా చేనేత కార్మికులు ఆందోళనలో పాల్గొనడంతో ట్రాఫిక్ స్థంభించిపోయింది. వన్‌టౌన్ ఎస్ఐ వలిబాష అక్కడికి చేరుకొని ధర్నాను విరమింప చేయడంతో ట్రాఫిక్ సమస్య తగ్గింది. ఈ ధర్నాలో మృతుని భార్య రామిశెట్టి సుశీల మాట్లాడుతూ తన భర్త కోళ్ళబైలు పంచాయితీలో ఇంటిస్థలాన్ని కొనుగోలు చేశారని అయితే ఈ స్థలానికి పురాణం చంద్రశేఖర్, పురాణం రత్నకుమార్, శివారెడ్డి, వెంకటేష్, చంద్ర, సిబ్బాల ప్రసాద్, శ్రీకాంత్ అనే వ్యక్తులు రమేష్‌బాబును భూమిలోకి రానివ్వకుండా బెదిరింపులకు పాల్పడేవారని తెలిపింది. నకిలి పట్టాలతో భూమి తమదేనని బెదిరించి కబ్జా చేయడంతో మృతునికి మనస్తాపం కలిగి అప్పులు ఓ వైపు, కష్టార్జితంతో సంపాదించిన స్థలం తనకు దక్కకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకొన్నట్లు పేర్కొంది. తన భర్త నోట్‌లో పేర్కొన్న పేర్లు వారందరిపై కేసు నమోదు చేయాలని కోరారు.

# గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు ధరఖాస్తులు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 20, ప్రభాతవార్త:

లక్కిరెడ్డిపల్లె సాంఘిక సంక్షేమ అంబెద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బిగిలిన సీట్లకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 25వ ధరఖాస్తులు చేసుకొని ఈ నెల 27న ఉదయం 9 గంటలకు లక్కిరెడ్డిపల్లె గురుకుల పాఠశాలలో పరిక్ష ఉంటుందని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరిక్షకు హజరుకావాలని ఆమే తెలిపారు. పరిక్ష అనంతరం మెరిట్ ప్రకారం ఎంపిక చేసి పాఠశాలలో చేర్చుకుంటామని ఆమె తెలిపారు.

# కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుపుకోసం మోకాళ్లపై మొక్కులు తీర్చుకున్న మహిళ గౌరీ..!!

పీలేరు, జూన్ 20 ప్రభాతవార్తః



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందితే మోకాళ్లపై కలియుగ దైవం వెంకటేశ్వరుని మొక్కు కోవడం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సంచలనం రేపింది. నియోజకవర్గంలోని కలికిరి మండలం గుట్టపాలెం పంచాయతీకి చెందిన మహిళ గౌరీ పీలేరు నియోజకవర్గంలోని కిషోర్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడంతో తెదేపా వీర మహిళ మోకాళ్లపై మెట్లు ఎక్కి తన మొక్కుబడి తీర్చుకుంది. గురువారం ఉదయం శ్రీవారి మెట్ల నడకమార్గం ద్వారా మోకాళ్లపై తిరుమలకు చేరుకోవడం జిల్లాలోనే సంచలనంగా మారింది. గౌరీ మోకాళ్లపై మొక్కులు తీర్చుకోవడంతో ఆమెకు పలువురు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

# ఇన్‌చార్జి సర్పంచి, ఇన్‌చార్జి ఈఓలపై డీపీఓకు ఫిర్యాదు

పీలేరు, జూన్ 20 ప్రభాతవార్తః



పీలేరు పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచి, ఈవో గఫూర్‌లు అధికార దుర్వినియోగం చేసి ఆ అభియోగాన్ని సర్పంచి హబీబ్‌బాషాపై ఎంపీడీఓకు తప్పుడు సమాచారం అందించారని జిల్లా కలెక్టర్‌కు, డీపీఓకు ఫిర్యాదుచేశారు. ఇన్‌చార్జి సర్పంచితో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచి తెలిపారు.

# సమాజంలో రెవెన్యూ అధికారులదే కీలక పాత్ర



తంబళ్లపల్లె, జూన్ 20, ప్రభాతవార్త:

సమాజంలోని ప్రతి వ్యక్తికి రెవెన్యూ సమస్యలే కీలకమని రెవెన్యూ అధికారులు పెద్దమనసుతో నిస్వార్థంగా సమస్యలు పరిష్కరించి ప్రజల ఆధరాభిమానాలు పొంది కీలక పాత్ర పోషించాలని తహసీల్దారు బ్రహ్మయ్య సూచించారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం తహసీల్దారఉ మాట్లాడుతూ రెవెన్యూకి సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ, భూ సమస్యల పరిష్కారం, విద్యార్థులకు సర్టిఫికెట్లు మంజూరు, ఎన్నికల నిర్వహణ తదితర సమస్యలపై తంబళ్లపల్లె రెవెన్యూ సిబ్బంది చేసిన కృషిని కొనియాడుతూ రాబోయే కొత్త ప్రభుత్వంలో సైతం ఇదే తరహాలో విధి నిర్వహణలో తమ సచ్ఛీలతను నిరూపించుకొని రైతులు, కక్షిదారుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి వారి నుంచి పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు. రైతుల నుంచి ప్రశంసలు పొందిన రిటైర్డ్ వీఆర్వో గంగులప్ప, , వీఆర్ఏ ప్రసాద్‌ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈడీటీ మౌలా, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పూజారి వెంకటరమణ, సంఘ కార్యదర్శి రమణ, మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వాహనం ఢీకొని విరిగిన విద్యుత్తు స్తంభం

తంబళ్లపల్లె, జూన్ 20, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండల కేంద్రం సమీపంలో బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వాహనం విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగిన సంఘటన వెలుగు చూసింది. తంబళ్లపల్లె క్రాస్ రోడ్డు ద్వారకా నగర్ సమీపంలో రాత్రిపూట ఓ గుర్తు తెలియని వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీకొంది. అయితే షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న లైన్‌ఇన్‌స్పెక్టర్ భాస్కర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని అందుబాటులో ఉన్న విద్యుత్తు ఉద్యోగులను వెంటనే రప్పించి తాను సైతం మరమ్మతు పనుల్లో పాల్గొని యుద్ధ ప్రాతిపదికన కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్తు అంతరాయం లేకుండా కృషి చేశారు. ఈ విషయమై భాస్కర్ మాట్లాడుతూ గుర్తు తెలియని వాహనం తెలియరాలేదని వాహనదారులు రోడ్డు పక్కన గల విద్యుత్తు స్తంభాలను గమనించి వాహనాలు నడపాలని సూచించారు. సకాలంలో స్పందించిన లైన్‌ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌ను తంబళ్లపల్లె పురప్రజలు అభినందించారు.

# ఆరోగ్య అవగాహన కార్యక్రమం

కడప లీగల్, జూన్ 20, ప్రభాతవార్త:

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కడప ఆధ్వర్యంలో గురువారం జిల్లాలో ఉన్న హిజ్రాలు/ట్రాన్స్‌జెండర్లకు ఆరోగ్య అవగాహన మరియు రక్త పరీక్షలు కార్యక్రమాన్ని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ ఈ మాసం ట్రాన్స్‌జెండర్లు గర్వించే నెలగా గుర్తించి పండుగ లాగా చేసుకోవడం సమాజంలో అందరిని సమానంగా ఉండాలని ప్రతి ఒక్కరిని కలుపుకోవాలని మరియు న్యాయ సంబంధిత సూచనలు, సలహాలు చెప్పడం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.నాగరాజు మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులు చట్టం దృష్టిలో అందరూ సమానమని వారికి 2017 సవరణ చట్టం అండగా ఉంటుందని తెలిపారు. 2019లో ట్రాన్స్‌జెండర్ చట్టంలోని ముఖ్య అంశాలను వివరించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి భాస్కర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించి హెచ్ఐవీ బాధితులకు మరియు హెచ్ఐవీ భారిన పడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు, సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.రవిబాబు, అతిథులు మరియు స్వచ్ఛంద సంస్థలు, వీహెచ్ఎస్, టింగో ప్రజా ప్రతినిధులు, పాజిటీవ్ నెట్‌వర్క్, ఆర్ట్ సెంటర్స్, వైఆర్‌జీ కేర్, జిల్లా సూపర్‌వైజర్, డీఏపీసీయూ స్టాఫ్, జిల్లా ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

# ఖచ్చితత్వంతో కూడిన సమాచార సేకరణ జరగాలి



గాలివీడు, జూన్ 20(ప్రభాతవార్త):

పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించి ఖచ్చితమైన సమాచార సేకరణతో పాఠశాల డేటాను నిర్వహించడానికి, వర్గీకరించడానికి, విశ్వసనీయ డేటాబేస్‌ను రూపొందించడానికి ఉపరియుక్తంగా ఉంటుందని ఎంఈఓలు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో యూ డై ప్లస్ మీద మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల సంబంధిత వివరాలను యూ డైస్ ప్లస్ డేటాను ఆన్‌లైన్లో పొందుపరచడం ద్వారా పాఠశాలల పనితీరు, పర్యవేక్షణపై నియంత్రణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయం



గాలివీడు, జూన్ 20(ప్రభాతవార్త):

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అత్యుత్తమ సేవలందిస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డ్‌ను ఏర్పాటు చేసిన సందర్భంగా రెవెన్యూ దినోత్సవం జరుపుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం రెవెన్యూ రికార్డులు, అడంగల్, 1-బి, ప్రభుత్వ, దేవాదాయ శాఖ, వక్ఫ్ భూముల వివరాలు డిస్‌ప్లే చేయడంతో పాటు సంబంధిత విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను సన్మానం చేయడంతో పాటు తమ విధులు, సేవల్లో అత్యుత్తమ పనితీరు కనపరిచిన రెవెన్యూ ఉద్యోగులను ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, మండల సర్వేయర్ తిమ్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 22న అవధూత నారాయణ స్వామి 75వ వార్షికోత్సవం



రామాపురం, జూన్ 20, ప్రభాతవార్త:

మండలంలోని సుద్దమల్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డి గారిపల్లిలో వెలసిన శ్రీ అవధూత నారాయణ స్వామి 75వ ఆరాధన మహోత్సవం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం అభిషేకం, మహాగణపతి స్వస్తి పుణ్య వాచనం, మండపారాధన పూజ, రుద్రాభిషేకం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిఎపారు. సాయంత్రం లక్కిరెడ్డిపల్లెకు శివసాగర్ కోలాటం భజన నిర్వహించబడునని తెలిపారు. ఈ ఆరాధన ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సద్గురువుల కృపకు పాత్రులు కావాలని కోరారు.

# మందక్రిష్ణకు దివ్యాంగులు పాలాభిషేకం

మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :



దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచేందుకు పోరాడిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందక్రిష్ణకు పాలాభిషేకం చేశారు. విహెచ్‌పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు షేక్ మౌళాలి ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ రూ.3వేల నుంచి 6వేలకు పెంచిన చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పవన్‌కళ్యాన్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలకు అభినందనలు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వికలాంగులను గుర్తించిన చంద్రబాబునాయుడుకు ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ, జిల్లా అధ్యక్షులు రవిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ చెవిటి, మూగ సంఘం నాయకులు చంద్ర, సునీల్, రాజు, వెంకటేష్, మధు, కుమార్, పప్పిరెడ్డి, సివి.రమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అవసరమున్న ప్రతి చోటా వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

పులివెందుల రూరల్, జూన్ 20, ప్రభాతవార్త ః



అవసరమున్న ప్రతి చోటా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనరు రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లెలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా కాలువల ద్వారా వెళ్లే ఏఆర్పటు చేయాలని సూచించారు. పిచ్చిమొక్కలు లేకుండా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి ఉంచా లన్నారు. గ్రామంలో నీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలరు రంగ నాయకులు, పబ్లిక్ హెల్త్ డీ ఈ సురేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 15 సంవత్సరాలుగా తిరుమల ట్రస్ట్ బెంగుళూరు వారి సేవలు మరువ లేనివి

: తిరుమల ట్రస్ట్ వారి సహకారంతో విద్యాసామాగ్రి వితరణ : ప్రతి విద్యార్థి కష్టపడి చదివినపుడే అనుకున్న లక్ష్యాలు నెరవేర్చుకోగలుగుతారు



**బద్వేలు అర్బన్, జూన్ 20 (ప్రభాతవార్త) :**
అన్ని దానాలలోకెల్లా విద్యాదానం గొప్పదని ఎంవీఐ శేఖర్‌రావు, ఎంఈవో చెన్నయ్య లు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే ఉద్దేశ్యంతో తిరుమల ట్రస్ట్ బెంగుళూరు వారు 2019లో తమ ట్రస్ట్‌ను స్థాపించి గత 15 సంవత్సరాలుగా బద్వేలు ప్రాంతమే కాకుండా ఇతర జిల్లాలలో కూడా ప్రతి సంవత్సరం పాఠశాలల ప్రారంభంలో సుమారు లక్ష రూపాయలు విలువచేసే విద్యాసామాగ్రిని ప్రభుత్వ పాఠశాలలో చదవే విద్యార్థులకు అందజేయడం వారి సేవలు మరువలేనివని వారు పేర్కొన్నారు. 2024 విద్యా సంవత్సరానికి గాను బద్వేలు మున్సిపాలిటీ పరిధి లక్ష్మిపాళెంలోని ఎంపీయూపి పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న సుమారు 100 మంది విద్యార్థులకు తిరుమల ట్రస్ట్ వారి సహకారంతో విద్యా సామాగ్రిని బద్వేలు మండల విద్యాశాఖాధికారి నిమ్మకాయల చెన్నయ్య, ఎంవీఐ శేఖర్‌రావు, ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, వ్యవ సాయ మార్కెట్‌యార్డు డైరెక్టర్ పబ్బుతి చంద్రశేఖర్, పెద్ది మెన్స్‌వేర్ సుధాకర్, ప్రైవేటు ఉపాధ్యాయులు సత్యనారాయణ చేతుల మీదుగా పలువురు విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పలువురు అధికారులను మరియు పలువురిని ఉపాధ్యాయులు పాలా శ్రీనివాసు లురెడ్డి, ఖాసిం, పీరమ్మ, శ్రీనివాసులు, రామక్రిష్ణం రాజు, విజయశ్రీ ,అనురాదతో పాటు పలువురు శా లువతో సత్కరించారు. అనంతరం ఎంవీఐ శేఖర్‌రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న వయసునుంచే కష్టపడి చదివినపుడే అనుకున్న లక్ష్యాలు నెరవేర్చుకోగలిగి పాటశాలకు, విద్యార్థులకు మంచి పేరు తెచ్చు కోగలరన్నారు. అలాగే చదువుతో పాటు సేవాభావం కూడా అలవరుచుకోవాలని, ప్రతి ఒక్కరూ భగవద్గీత లోని అన్ని శ్లోకాలను నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాట వినాలన్నా రు. అనంతరం ఎంఈవో చెన్నయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదవుకోవాలని విద్యార్థులకు అ వసరమైన అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వంఅందజేస్తుందన్నారు. 1 నుంచి 5 వ తరగతి విద్యార్థులకు తిరుమల ట్రస్ట్ వారు విద్యాసామాగ్రిని అందించడం జరిగిందన్నారు. అనంతరం ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు,వ్యవసాయ మార్కెట్‌యార్డు డైరెక్టర్ పబ్బుతి చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా బద్వేలు ప్రాంతంలో చదివే పేద విద్యార్థులకు తిరుమల ట్రస్ట్ వారు విద్యాసామా గ్రిని అందించడం సంతోషకరమని విద్యార్థులు ఈ విద్యాసామాగ్రిని వినియోగించుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. రాబోయే రోజులలో తిరుమల ట్రస్ట్ వారి సేవలు పేద విద్యార్థులకు ఇలాగే కొనసాగాలని పబ్బుతిసత్యనారాయన, పెద్ది సుధాకర్, దాదాపీర్‌లు ఆకాంక్షించారు.

# స్నేహమేరా జీవితం

**పోరుమామిళ్ల, జూన్ 19 ప్రభాతవార్త**

మనుషుల్లో నానాటికి ప్రేమ, ఆప్యాయతలు కొరవడుతున్నా జంతువులలో మాత్రం ఆ స్వార్థం కానరాదు. అందుకే కాబోలు ఇక్కడ ఓ మేకల గుంపు వెళ్తుంటే ఓ మేకపైకి ఎక్కిన మర్కటం వాటిని యజమాని వలె సక్రమ దారిలో నడిపిస్తూ జంతువుల మధ్య బేదాభి ప్రాయం లేదన్నట్లు వ్యవహరించింది. ఇది చాలాదూరం అలానే వెళ్లినప్పటికీ మేక కూడా తన మిత్రుడే తనపై ఉన్నట్లు దానిని మోసుకెళ్లడం గమనార్హం. ఈ దృశ్యం పోరుమామిళ్లలో కనిపించింది.



## మంచినీరు పొదుపుగా వాడడంపై అవగాహన ర్యాలీ




**కలికిరి, జూన్ 20, ప్రభాతవార్త:**
మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ఆధ్వర్యంలో మంచినీరు పొదుపుగా వాడడంపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతి నీటి బొట్టు ప్రగతికి మెట్టు అని అదే విదంగా నీరే ప్రాణం దానికి మీరే రక్షణ కవచం, నీటిని సంరక్షిద్దాం, కరువును తరిమికొడదాం, జీవితం పరిరక్షణే భవిష్యత్తు అంటూ నినాదాల ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి గాయత్రి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షణాధికారి నాగిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, ఉపాధ్యాయులు చాముండేశ్వరయ్య, సచివాలయం పంచాయతీ కార్యదర్శి జనీఫా రాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రశాంతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ రోషన్ ఆరా, మహిళా పోలీస్ దాక్షాయణి, సిబ్బంది పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన రెడ్డిప్రసాద్



**రామాపురం, జూన్ 20, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన గంపరెడ్డి ప్రసాద్ జాతీయ కబడ్డీ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. జమ్మూకాశ్మీర్‌లోని ఎంఏ స్టేడియంలో 4వ వైఎస్‌పీఏ నేషనల్ ఛాంపియన్‌షిప్ 2024లో అబో-19 విభాగంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో జమ్ము కాశ్మీర్‌లో జరిగిన కబడ్డీ పోటీలలో రెడ్డిప్రసాద్ ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. తల్లిదండ్రులు గంపా నాగేంద్ర, బంధువులు, మండల ప్రజలు ప్రసాద్‌ను అభినందించారు.

## ఆర్టీసీ బస్టాండు వద్ద మెరుగైన పరిశుభ్రత చర్యలు



**కడప కార్పొరేషన్, జూన్ 20, ప్రభాతవార్త:**
ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పరిశుభ్రంగా ఉంచుతామని, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూస్తామని కడప నగర పాలక సంస్థ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.ఎం. చంద్రశేఖర్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండులో పారిశుద్ధ్య ఏర్పా ట్లను ఘనణీయంగా పెంచాలని వర్షపు నీరు విలువ లేకుం డా చేయాలని కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ ఆదేశాల మే రకు పనిచేస్తున్నట్లు చెప్పారు. గల్ఫోర్ మిషిన్లు, జేసీబీలు, ట్రాక్టర్లు, జెట్టింగ్ మిషిన్‌తో సహా ప్రత్యేక పరికరాల విస్తర ణతో పాటు మలేరియా కార్మికుల ఆకారంతో సౌత్‌జోన్ శానిటరీ వర్కర్ల సమిష్టి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బ స్టాండు వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని పేర్కొన్నారు.

## అభివృద్ధి ప్రదాత మీరే సార్



**రైల్వేకోడూరు,జూన్ 20,ప్రభాతవార్త:**
రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మీరే సీ ఎం సారూ..అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడికి రైల్వేకోడూరు టిడిపి ఇచ్చార్జి కింగ్ మేకర్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని రూపానందరెడ్డి కలిసి ని యోజకవర్గ అభివృద్ధి పై ప్రత్యేక చర్చ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ముఖ్యంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఐదు మండలాలలో గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు పెండింగ్లో ఉన్న బ్రిడ్జి పనులు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నియోజకవర్గాన్ని అ భివృద్ధి పథంలో నడిపించాలని ఆయన ముఖ్యమంత్రి దృ ష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మొదటగా రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పూర్తిస్థాయిలో అభివృ ద్ధికి నోచుకోక ఎన్నో సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉందని రెండు రోజుల్లో ఆర్టీసీ బస్టాండ్ సందర్శించి దానికి సంబంధించిన బౌండరీస్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారులతో చ ర్చించి, రైల్వేకోడూరు ఆర్టీసీ బస్టాండ్ ను ఆధునీకరణ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు సంబంధిత కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. అదే విధంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్రజా సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయని,ఎన్నికలలో ఇచ్చి న హామీలను అంచెలంచెలుగా పూర్తిచేసి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ముక్కా రూపానంద రెడ్డి ముఖ్యమంత్రికు ఇచ్చిన వినతి పత్రంలో ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



**వేంపల్లె, జూన్ 20, ప్రభాతవార్త :**
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల వద్దకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ చెప్పారు. క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని, ఆమె సూచించారు. గురువారం వేంపల్లెలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్టూడెంట్ కానుక అందించారు. కష్టపడి, ఇష్టపడి చదివినప్పుడే మంచి విజయాన్ని సొంతం చేసుకోగలమని, తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జాఫర్‌సాదిక్, స్టాలి న్ ఐజాక్, హెచ్ఎం శివమునెమ్మ, ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, రాజశేఖర్, ఎమ్మార్సీ సిబ్బంది అబ్దుల్ కల్యాణి పాల్గొన్నారు.

























## కేఎస్ఆర్ఎం కళాశాల స్నాతకోత్సవం

**కడప వైద్యవిభాగం, జూన్ 20, ప్రభాతవార్త:**
కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 2020-2024 బ్యాచ్‌లో వివిధ బ్రాంచ్‌లలో విద్యను పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు 7వ స్నాతకోత్సవాన్ని జూన్ 22వ తేదీ కళాశాల ఆడిటోరియం నందు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజల సమస్యలపై దృష్టి సారించండి

**తంబళ్లపల్లె, జూన్ 20, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలంలో నిష్పక్షపాతంగా ప్రజల సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ సూచించారు. గురువారం ఆయన తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మహిళా నేత సిద్దమ్మల ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ నాయక్‌తో వారు మాట్లాడుతూ గతంలో వైకాపా ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు జరిగాయని ఎన్‌డీఏ కూటమి మా అధినేతలు దీనికి విరుద్దమని అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే కూటమి లక్ష్యమన్నారు. మండలంలో గతంలో వైకాపా ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన వారిపై నిఘా ఉంచామని త్వరలో ప్రక్షాళన చేసి నిజాయితీగా ప్రజల సేవ చేసే అధికారులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఐకేపీ, ఉపాధి హామీ కార్యాలయాలను సందర్శించారు. వారి వెంట యువత గంగరాజు, నరసింహులు, సోమశేఖర్, మ్యూజికల్ శివ, జయరాంరెడ్డి, బేరి శ్రీనివాసులు, అప్పిరెడ్డి, కాలా నారాయణ, వీరాంజనేయులు, జనసేన నాయకులు నరేందర్‌రెడ్డి, మురళీ, హరీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సబ్‌కలెక్టరేట్‌లో ఘనంగా రెవెన్యూ దినోత్సవం




**మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :**
సబ్‌కలెక్టరేట్‌కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం పదవీవిరమణ పొందిన ఉద్యోగులను శాలువతో సత్కరించి సన్మానాలు చేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ దినోత్సవం జరుపుకోవడం ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందన్నారు. పదవీవిరమణ పొందిన ఏఓ మునిప్రసాద్, డిప్యూటి తహశీల్దార్ సత్యకుమార్‌లను తన చేతుల మీదుగా సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.